
క్లుప్తంగా

ఉగ్రవాదులను అంతమొందించాలి

● వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



కర్నూలు (టౌన్): కశ్మీర్‌లోని పహల్గాంలో మారణహోమం సృష్టించిన ఉగ్రవాదులను అంతమొందించాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలోని అన్ని పార్టీలు ఈ ఘటనను తీవ్రంగా ఖండించాయన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఈ ఘటనను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. వెంటనే ఉగ్రవాదులను ఏరివేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు. దేశ సరిహద్దులో ఉన్న పాకిస్థానీ ఉగ్రవాద శిబిరాలను సమూలంగా నాశనం చేయాలన్నారు. దేశ విచ్ఛిన్నానికి కుట్రలు చేస్తున్న దాయాదు పాకిస్తాన్ చర్యలను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. దేశంలోని హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు అందరూ కేంద్రంలోని బీజేపీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నారన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోను దేశంలో కలుపుకుంటే ఉగ్రవాద చర్యలకు పుల్‌స్టాప్ పెట్టవచ్చని, కేంద్రం ఆదిశగా ఆలోచించాలన్నారు.

భక్తి శ్రద్ధలతో తైలాభిషేకం



శనైశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్య నారాయణ స్వామి ఆలయంలో శని త్రయోదశిని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనైశ్వర స్వామివారికి తైలాభిషేకం, అర్చనలు, శనైశ్వర హోమం తదితర పూజలు విశేషంగా జరిగాయి. శనైశ్వర స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ విజయ మనోహరి

కర్నూలు (టౌన్): సీ క్యాంపు ప్రార్థన మందిరం నిర్వహిస్తున్న వీబీఎస్ (విరామ బైబిల్ పాఠశాల) కార్యక్రమంతో చిన్నారులు ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్ పర్సన్ విజయ మనోహరి అన్నారు. శనివారం వీబీఎస్ ప్రారంభ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచి మంచి మార్గంలో నడవాలంటే ఇటువంటి వీబీఎస్ ఎంతగానో ఉపయోగపడతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ కార్పొరేటరు కటారి పల్లవి, కటారి సురేష్, అకేపోగు ప్రిన్స్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో అదృశ్యమైన రోగి మృతి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రెండు రోజుల క్రితం అదృశ్యమైన రోగి మృతి చెందాడు. కృష్ణగిరి మండలం బాపనదొడ్డి గ్రామానికి చెందిన చిన్న ఆంజనేయులు(80)కు ఆయాసం ఉండటంతో ఆయన కుమారుడు బీరప్ప గత బుధవారం చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకొచ్చారు. ఆయనను అత్యవసర విభాగం వద్ద ఉంచి స్కానింగ్ రిపోర్టు తీసుకుని రావడానికి వెళ్లి వచ్చేలోపే చిన్న ఆంజనేయులు కనిపించకుండా పోయాడు. అప్పటి నుంచి ఎంత గాలించినా ఆయన జాడ కనిపించలేదు. ఈ విషయాన్ని 25వ తేదీన 'ప్రభుత్వాసుపత్రిలో రోగి అదృశ్యం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైంది. పత్రికలో వచ్చిన ఫోటో ద్వారా అతన్ని కర్నూలు నగరంలోని రాజవిహార్ సెంటర్‌లో ఉన్న ఆర్టీసీ బస్‌డిపో ఖాళీ స్థలంలో కొందరు గుర్తించారు. పత్రికలో ఉన్న సెల్ నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబసభ్యులు వచ్చి అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆయన అదే రోజు రాత్రి మృతి చెందాడు.

ఉగ్రదాడిని ఖండించాలి



కలెక్టరేట్ ఎదుట కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): ఉగ్రదాడిని యావత్తు ప్రపంచం ఖండించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు కోరారు. శనివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని పెంచి పోషించిన ఏ దేశం కూడా బాగుపడినట్లు చరిత్రలో లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు పీవీ శేషయ్య, తిమ్మప్ప, టీవీ రామకృష్ణయ్య, నరేంద్ర నాథ్, యూసూఫ్‌బాషా, చాంద్‌బాషా, రామలింగేశ్వరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి ఏదీ.. సౌకర్యాలు ఎక్కడ?

● అధికారులను నిలదీసిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు
● అడ్డు తగిలిన టీడీపీ కార్పొరేటర్లు
● నగరపాలక కౌన్సిల్ సర్వసభ్య సమావేశం రసాభాసా
● టీడీపీ ఫ్లోర్ లీడర్‌పై మండిపడిన మేయర్
● రూ. 7.22 కోట్ల అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్

కర్నూలు (టౌన్): 'ఏడాది కాలంగా పనులు జరగడం లేదు. టెండర్లు లేవు. పారిశుద్ధ్యం, తాగునీరు వంటి సమస్యలతో స్థానిక ప్రజలకు సమాధానం చెప్పలేక పోతున్నాం' అంటూ పలువురు కార్పొరేటర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వంలో ప్రజలకు కనీసం సంక్షేమ పథకాలు ఇవ్వలేదు. కనీసం మౌలిక సదుపాయాలు కల్పించేందుకు డబ్బులు లేవా... పనులు చేసిన కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వకుంటే ఎలా'.. అంటూ సభలో అధికారులను నిలదీశారు. కౌన్సిల్ సమావేశానికి అంటే పిక్నిక్‌కు వచ్చినట్లు ఉంది. స్నాక్స్ తినడం. కూర్చోవడం, వెళ్లి పోవడం తప్పా.. పనులు జరగడం లేదు' అని వాపోయారు. సుదీర్ఘంగా జరిగిన చర్చలో సభ్యులు వాదోపవాదాల మధ్య 25 అంశాలకు సంబంధించిన తీర్మానాలను ఆమోదించారు. రూ.7.22 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. శనివారం స్థానిక నగర పాలక నూతన కౌన్సిల్ సమావేశంలో మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన నగరపాలక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ ప్రారంభానికి ముందు తొలిసారిగా సమావేశానికి వచ్చిన కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజుకు మేయర్, కమిషనర్ సన్మానం చేశారు. అనంతరం కశ్మీర్‌లో ఉగ్రదాడిలో చనిపోయిన యాత్రికులకు, అలాగే ఇటీవల 38వ వార్డు కార్పొరేటర్ గిప్సన్ మృతి చెందడంపై కౌన్సిల్ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అంతకు ముందు కర్నూలు పార్లమెంటు సభ్యులు నాగరాజు మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను మినిట్స్ పెట్టి, వాటి పురోగతిని ఆయా సభ్యులకు తెలియజేయాలన్నారు. అధికారులు సైతం క్షేత్ర స్థాయిలో పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ కల్లూరు 16 వార్డులో నగరపాలక సంస్థకు పన్నుల ద్వారా అత్యధికంగా ఆదాయం వస్తుందని, అయితే తాగునీటి సమస్య అనేక కాలనీల్లో పరిష్కారం కావడం లేదన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి కర్నూలుకు నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చెత్త సమస్య తీవ్రంగా ఉందని, పుష్‌గాట్‌లు లేవని, క్లాప్ ఆటోలు లేక నగరంలో చెత్త సమస్య మళ్లీ మొదటికి వచ్చిందన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ కోడుమూరు అర్బన్‌లో మూడు వార్డులు ఉన్నాయని, మంచినీటి సమస్య, మురుగు కాల్వల సమస్య తీవ్రంగా ఉందన్నారు. కేసీ కెనాల్‌లో మురుగునీరు ఎక్కువైందన్నారు. సమావేశంలో కమిషనర్ రవీంద్రబాబు, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, అదనపు కమిషనర్ ఆర్‌జీవీ. క్రిష్ణ, మున్సిపల్ ఎస్ఈ రాజశేఖర్, సీటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం

సమావేశం ప్రారంభంలో పలువురు కార్పొరేటర్లు తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. మినిట్స్ నమోదు చేస్తున్నారా.. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఏ స్థాయిలో ఉన్నాయంటూ కార్పొరేటర్ ఆర్షియా పర్వీన్ ప్రశ్నించారు. సమాధానం చెప్పాలంటూ అధికారులపై ఒత్తిడి తీసుకు వచ్చారు. అయితే కమిషనర్ స్పందించే లోపు టీడీపీ ఫ్లోర్ లీడర్ పరమేష్ అడ్డు తగిలారు. అయితే ప్రతి ప్రశ్నకు టీడీపీ కార్పొరేటర్ ఎందుకు మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు నిలదీశారు. అయినా పరమేష్ తీరు మారక సభలో కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. అప్పటికే అక్కడే ఉన్న పోలీసులు వచ్చి సర్ది చెప్పారు. సభ్యులు సంయమనం పాటించాలని మేయర్ సభను 10 నిమిషాలు వాయిదా వేశారు. కాగా సమావేశంలో పలువురు అధికారులపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పట్టించుకోవడం లేదని, ప్రోటోకాల్ పాటించడం లేదని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు సుదర్శన్ రెడ్డి, గాజుల శ్వేతారెడ్డి, రాజేశ్వరరెడ్డి నారాయణ రెడ్డి, నరసింహులు, సాన శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, నాగలక్ష్మీరెడ్డి, షేక్ అహమ్మద్, షేక్ యూనుస్‌బాషా, జుబేర్, సిట్రా సత్య నారాయణమ్మ, షాషావలీ, అరుణ అధికారులను నిలదీశారు.



టీడీపీ కార్పొరేటర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మేయర్ బీవై రామయ్య



వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను బెదిరిస్తున్న టీడీపీ కార్పొరేటర్ పరమేష్

టీడీపీ ఫ్లోర్ లీడర్‌పై మండి పడ్డ మేయర్

నగర మేయర్ బీవై రామయ్య టీడీపీ ఫ్లోర్ లీడర్‌పై మండి పడ్డారు. సభలో అందరూ మాట్లాడవచ్చని, సభ్యులు మాట్లాడితే మీరు సమాధానం చెప్పేందుకు పదే పదే ఎందుకు లేస్తున్నారంటూ మేయర్ ప్రశ్నించారు. అయితే ఖాతరు చేయని ఆయన అదే స్థాయిలో మాట్లాడుతుంటే 'పరమేష్ మీ గురించి అంతా తెలుసు. కార్పొరేషన్‌లో ఏం చేస్తున్నావో.. కూర్చో.. కొంచెం తగ్గు' అంటూ గట్టిగా సమాధానం ఇచ్చారు. కార్పొరేటర్లు సైతం అదే స్థాయిలో నిలదీయడంతో చేసేదేమి లేక కూర్చున్నాడు.

మూడు కూడళ్లు, రెండు ప్రాంతాలకు కొత్త పేర్లు

నగరపాలక సర్వ సభ్య సమావేశంలో కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు సూచనల మేరకు ఆనంద్ టాకీస్ నుంచి కిసాన్ ఘాట్‌కు పోయే రోడ్డు సర్కిల్‌కు శ్రీకనకదాసు సర్కిల్, కర్నూలు మరాఠ సేవ సంఘం విన్నపం మేరకు కోడుమూరు రోడ్డులో ఉల్చాల వై జంక్షన్ కూడలికి ఛత్రపతి శివాజీ మహారాజ్ సర్కిల్‌గా, బంగారుపేట, శ్రీరామ టాకీస్ వద్ద ఉన్న సర్కిల్‌కు బసవ సర్కిల్‌గా నామకరణం చేశారు. అలాగే పాతబస్తీలోని బేకారి కట్ట వీధికి జనాబ్ అబ్దుల్ సలాంఖాన్ సాహెబ్‌గా, గరీబ్‌నగర్‌కు డాక్టర్ కే. ఇస్మాయిల్ హుస్సేన్‌గా కొత్త పేర్లు ఆమోదించారు.





మౌనం పాటించి ఉగ్రదాడి మృతులకు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్లు, అధికారులు

అవయవదానానికి ముందుకు రావాలి

కర్నూలు(హాస్పిటల్): అవయవదానంతో మరో వ్యక్తికి పునర్జన్మను ఇవ్వవచ్చని, ప్రతి ఒక్కరూ అవయవదానానికి ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. శనివారం స్థానిక కిమ్స్ హాస్పిటల్‌లో అవయవదానంపై నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు. హాస్పిటల్‌లో ఇప్పటి వరకు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు చేసిన వైద్యులను, కిడ్నీ దాతలను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవన్‌ధాన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవయవదానాన్ని అమలు చేస్తున్నాయని, ఈ గొప్ప పనిని అందరూ ప్రోత్సహించి ఆపదలో ఉన్న వారికి అవసరమైన వారికి కొత్త జీవితాన్ని ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. కిమ్స్ గ్రూప్స్ ఆసుపత్రుల సీఎండీ, ప్రముఖ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ ఆసుపత్రిలో ఇప్పటికి 56 కిడ్నీ మార్పి ఆపరేషన్లు నిర్వహించామన్నారు. జిల్లాలో లక్ష మందితో అవయవదాన రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కర్నూలు కిమ్స్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష మందితో అవయవదాన రిజిస్ట్రేషన్ పత్రాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

వ్యవసాయంలో డ్రోన్ వినియోగాన్ని పెంచాలి

● కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో రైతులు డ్రోన్ వినియోగాన్ని పెంచుకుని పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవచ్చునని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం సరికొత్త మార్పునకు నాంది పలుకుతుందని పేర్కొన్నారు. శనివారం కర్నూలు ఉద్యానభవన్‌లో డ్రోన్‌ల వినియోగంపై గ్రూపుల కన్వీనర్, కో-కన్వీనర్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జేసీ బి.నవ్య కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మన దేశం పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడిందని, వ్యవసాయంలో అభివృద్ధి ఉంటేనే ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుని అధిక ఉత్పాదకతను పెంచుకోవడానికి సాంకేతికత ఎంతో అవసరమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఎల్‌డీఎం రామచంద్రరావు, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి, ఏడీఏలు, డ్రోన్ గ్రూపు కన్వినర్లు, కో-కన్వినర్లు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం పారిశ్రామికంగా ఎదగదాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని ప్రతి కుటుంబం పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం మినీ కాన్ఫరెన్స్ హాలులో వన్ ఫ్యామిలీ..వన్ ఎంటర్‌ప్రెన్యూర్‌పై కలెక్టర్, మునిసిపల్, మెప్మా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 2,827 కుటుంబాలు ఎంట్రప్రెన్యూర్‌గా ఎదిగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న మెప్మా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ నాగ శివలీల, ఎల్‌డీఎం రామచంద్రరావు, మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అరుణ పాల్గొన్నారు.

పశు వైద్యులకు ప్రత్యేక గౌరవం

కర్నూలు(అగ్రికల్చర్): నోరులేని మూగ జీవాలకు వైద్య సేవలు అందించే పశువైద్యులకు సమాజంలో ప్రత్యేక గౌరవం ఉంటుందని జిల్లా పశుసంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పశువైద్య దినోత్సవ కార్యక్రమం కిసాన్ ఘాట్‌లోని ఫన్ అండ్ ఫుడ్ సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లాలో పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంటు సర్జన్‌లు, ఏడీలు, డీడీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేడీ డాక్టర్ శ్రీనివాస్ పశువైద్యులు, ఏడీ, డీడీలతో పశువైద్య ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పశువైద్యులు ఆటపాటలతో అలరించారు. పశువైద్య కోర్సు చదవే సమయంలో ఎలా ఉంటారు..పశు వైద్యుడిగా ఉద్యోగం సంపాదించిన తర్వాత ఒత్తిడి ఎలా ఉంటుందనే దానిని నాటకం రూపంలో ప్రదర్శించారు. పశువైద్యులకు ఇటీవల నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కర్నూలు, ఆదోని డీడీలు దుర్గాప్రసన్నబాబు, వెంకటరమణ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ రాజశేఖర్, వీపీసీ డీడీ హేమంత్‌కుమార్, బనవాసిఘనీకృత వీర్య నిల్వ కేంద్రం డీడీ చంద్రశేఖర్, ఏడీలు మల్లన్న, రవిప్రకాశ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ధనుంజయుడు, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్

ర్యాలీని విజయవంతం చేయండి

కర్నూలు(సెంట్రల్): వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఈనెల 28వ తేదీన కర్నూలు నగరంలో భారీ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు సేవ్ వక్ఫ్ జేఏసీ నాయకులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్, డి.అబ్దుల్‌దేశాయ్, ఇంతియాజ్ తెలిపారు. ఈ ర్యాలీకి మతాలు, కులాలకు అతీతంగా రాజకీయ పార్టీలు, వివిధ ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు. శనివారం ఆవాజ్ కమిటీ కార్యాలయంలో సేవ్ వక్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణను వెనక్కి తీసుకునే వరకు ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సేవ్ వక్ఫ్ పేరుతో పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 28వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు ఇస్లామీయా అరబిక్ కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిద్దాం

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల పిలుపునిచ్చారు. శనివారం సూర్యనారాయణ భవన్‌లో జరిగిన పార్టీ న్యూసిటీ కమిటీ సమావేశంలో స్మార్ట్ మీటర్లు మాకొద్దు - కరెంట్ చార్జీలు తగ్గించాలని అనే నినాదంతో ఉన్న స్టిక్కర్లను ఆ పార్టీ నాయకులు టి.రాముడు, సీహెచ్ సాయిబాబా, సుధాకరప్ప, ఆర్.నరసింహులు, కె.అరుణ, కె.ప్రభాకర్, వై.నగేష్, శ్యామల, ఏసు, మహ్మద్ రఫీలతో ఆమె కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి పక్షంలో ఉన్న సమయంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ...అధికారంలోకి రాగానే వాటికే అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. స్మార్ట్ మీటర్లను బిగించము అని చెప్పిన హామీని తుంగలోకి తొక్కిందన్నారు.



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నేడు మిమిక్రీ ఆర్టిస్ట్ ఖాదర్ బాబు అభినందన సభ

కర్నూలు కల్చరల్: శ్రీశైలం ప్రాజెక్ట్ విశ్రాంత సర్కిల్ అధికారి, మిమిక్రీ ఆర్టిస్ట్ ఖాదర్ బాబు అభినందన సభను ఆదివారం సాయంత్రం 5 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాటక రంగంలో ట్రిబుల్ యాక్షన్‌తో శ్రీకృష్ణ రాయబారం నాటకం నుంచి శయన ఘట్టం టెలిఫిలిం నిర్మించినందుకు, సీనియర్ సినిమా హీరోల గెటప్‌లతో షార్ట్‌ఫిలిం నిర్మించినందుకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ తదితరులు అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు.

డెంగీ జ్వరంతో జాగ్రత్త

కర్నూలు(హాస్పిటల్): డెంగీ జ్వరం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ అధికారి డాక్టర్ బి. రామగిడ్డయ్య హెచ్చరించారు. శనివారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో నిర్వహిస్తున్న డెంగీ నివారణ చర్యలను ఆయన పరిశీలించారు. ఉల్చాల గ్రామంలో డెంగీ జ్వరం బారిన పడి కోలుకున్న బాలుడి ఇంటి పరిసరాలు, గ్రామంలో చేపట్టిన నివారణ చర్యలను తనిఖీ చేశారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది వారి పరిధిలోని గ్రామాలను సందర్శించి ప్రజలను వారానికి ఒకసారి నీటి నిల్వలు లేకుండా పూర్తిగా తొలగించి దోమల పెరుగుదలను అరికట్టే విధంగా అవగా హన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డీఎంఓ నూకరాజు, ఏఎంవో చంద్రశేఖర్, సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణమోహన్, ఆరో గ్య పర్యవేక్షకులు రఘు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన అవసరం

కర్నూలు(హాస్పిటల్): ఆరోగ్య సమస్యలపై ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన అవసరమని, ఈ మేరకు ప్రజల్లో వైద్య సిబ్బంది చైతన్యం తీసుకురావాలని సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. శనివారం స్థానిక నగర శివారులోని బి.తాండ్రపాడు గ్రామంలోని జిల్లా మహిళా సమాఖ్య సమావేశ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైద్య ఆరోగ్యశాఖ చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చెప్పారు. కార్యక్రమంలో డెమో శ్రీనివాసులు శెట్టి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి నివాళి

కర్నూలు సిటీ: ఎస్టీయూ సీనియర్ నాయకులు ఎస్.ప్రసాద్ రావు ఇటీవలే గుండెపోటుతో మృతి చెందడంతో శనివారం సలాంఖాన్ భవనంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ముందుగా ప్రసాద్ రావు చిత్ర పటానికి ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోకారి, టి.కే జనార్దన్, రాష్ట్ర పూర్వ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.తిమ్మన్నలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మౌలాలి, అజాంబేగ్, జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు రమేష్, ఉమ్మడి రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, ఇక్బాల్, వీరచంద్ర యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకుందాం

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవడం కోసం విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహ పిలుపునిచ్చారు. శనివారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగుతులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప, ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్ పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా బీఎస్ఎన్ఎల్ సేవలు

కర్నూలు(హాస్పిటల్): 'కనెక్టింగ్ విత్ కేర్' నినాదంతో ప్రజలకు మరింత మెరుగ్గా బీఎస్ఎన్ఎల్ సేవలు అందించనున్నట్లు ఆ సంస్థ సేల్స్ అండ్ మార్కెటింగ్ డివిజనల్ ఇంజినీర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎన్.దేవచంద్ నాయక్ చెప్పారు. శనివారం నగరంలోని సి.క్యాంపు ప్రాంతంలో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు అవగాహన కల్పించారు. భారత్ ఫైబర్ ఇంటర్‌నెట్ సర్వీస్‌లో స్పెషల్ డిస్కౌంట్‌లను ప్రవేశపెట్టామన్నారు. ఫైబర్ బేసిక్ నియో 449 ప్లాన్ తీసుకున్న వారికి మూడు నెలల వరకు రూ.50ల నుంచి రూ.100ల డిస్కౌంట్ పొందవచ్చన్నారు. బీఎస్ఎన్ఎల్ ఐఎఫ్ టీవీ సర్వీసు ద్వారా ఇంటర్‌నెట్‌తో పాటు టీవీ చానళ్ల వీక్షించేందుకు వీలు కల్పించామన్నారు. కార్యక్రమంలో ఏజీఎం అర్బన్(కర్నూలు) వి.శ్రీను నాయక్, ఎస్‌డీఈలు బాలాజిరెడ్డి, టి.వెంకటేశ్వర్లు, పి. మహమ్మద్‌హుసేన్, టీఐపీలు వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

పండ్లను ఎథిలిన్‌తో మాగబెడితే కఠిన చర్యలు



పోస్టర్లను విడుదల చేస్తున్న జేసీ నవ్య, టాస్కు ఫోర్సు బృంద సభ్యులు

కర్నూలు(సెంట్రల్): మార్కెట్‌లో సహజంగా లభించే వివిధ రకాల పండ్లను క్యాల్షియం కార్బైడ్, ఎథిలిన్ అమ్లంతో మాగబెట్టడంపై జేసీ డాక్టర్ బి.నవ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. రసాయానాలతో పండ్లను మాగబెడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె తన కార్యాలయంలో రసాయనాలతో పండ్లను మాగబెట్టే వ్యాపారులపై దాడుల కోసం నియమించిన టాస్కు ఫోర్సు కమిటీతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..రసాయనాలతో మాగిన పండ్లను తింటే ప్రజలు అనారోగ్యం బారిన పడతారన్నారు. సహజ సిద్ధంగా పండ్లను మాగేలా అన్నదాతలు, వ్యాపారులు చర్యలు తీసుకునేలా చూడాలని సూచించారు. కాగా.. టాస్కు ఫోర్సు టీంలో ఫుడ్ సేఫ్టీ అధికారి, డీపీఓ, మార్కెటింగ్ ఏడీ, మునిసిపల్ కమిషనర్, హార్టికల్చర్ డీడీ, ట్రాన్సుపోర్టు డీటీ సభ్యులుగా ఉంటారు.

ఒకే ఆవరణలో రెండు కాలేజీలు వద్దు

● ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ పూర్వ విద్యార్థులు

కర్నూలు సిటీ: ఒకే ఆవరణలో క్లస్టర్, ఉర్దూ యూనివర్సిటీల కాలేజీలు నిర్వహించొద్దని కర్నూలు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ పూర్వ విద్యార్థులు అన్నారు. కేటాయించిన స్థలాల్లోనే క్లస్టర్, ఉర్దూ యూనివర్సిటీలను అభివృద్ధి చేయాలని కోరారు. డిగ్రీ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వై.జయరాజు కార్యాలయంలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధ్యక్షులు వై.జయరాజు, సంఘం కార్యదర్శి ఆచార్య మన్సూర్ రహిమాన్, సంఘం వ్యవస్థాపక సభ్యులు అజయ్‌కుమార్ మాట్లాడారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీకి సొంత భవనాలు లేకపోవడంతో పూర్వ విద్యార్థులు కలిసి 12 ఎకరాల భూమిని కొనుగోలు చేసి కర్నూలు ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా అందించారన్నారు. కాలేజీలో ప్రస్తుతం 1,000 మంది విద్యార్థులు ఉన్నారని, తరగతి గదులు సరిపోవడం లేదన్నారు. ఇలాంటి సమయంలో ఉర్దూ యూనివర్సిటీకి తాత్కలికం పేరుతో కాలేజీ భవనాలు కట్టబెట్టాలనే ప్రయత్నం సహేతుకం కాదన్నారు. సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సభ్యులు, గౌరవ సలహాదారులు ఎస్.ఎండీ ఇషాక్, సుధాకర్, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు సమష్టి కృషి

● ఐసీడీఎస్ పీడీ నిర్మల

కర్నూలు(అర్బన్): బాల్య వివాహాలను పూర్తి స్థాయిలో నివారించేందుకు వివిధ ప్రభుత్వ శాఖలతో కలిసి సమష్టి కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ నిర్మల అన్నారు. శనివారం నగర శివారుల్లోని జీవసుధ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కిషోరి వికాసంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి నోడల్ అధికారులు, సీడీపీఓ, డీసీపీఓలు హాజరయ్యారు. యూనిసెఫ్ ప్రతినిధులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మల మాట్లాడుతూ కిషోరి వికాసం జిల్లాలో యుక్త వయస్సు బాలికల సాధికారత కోసం వేసవి సెలవుల్లో ప్రత్యేక క్యాలెండర్‌ను విడుదల చేశామన్నారు. ఈ క్యాలెండర్ ప్రకారం గ్రామ స్థాయిల్లో ఎలాంటి కార్యక్రమాలను చేపట్టాలనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్, వైఎస్సార్ జిల్లా డీసీడీఓ అనీత, కడప మెప్మా సీఈఓ కల్పన, సీఐ విజయలక్ష్మి రాష్ట్ర యునిసెఫ్ ప్రతినిధులు జోన్స్, నరసింహమూర్తి, ఐసీడీఎస్ స్టేట్ ఆఫీసర్ కమల్‌కుమార్, డీసీపీఓ శారద, డీసీపీయు సిబ్బంది శ్రీలక్ష్మి, దీప, గీతా, పద్మ, నరసింహులు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

మద్యపానంతో ఆరోగ్యం వధ

కర్నూలు: మద్యం, సారా వినియోగం ఆరోగ్యానికి హానికరమని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.హనుమంతరావు అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కర్నూలు మండలం పసుపుల గ్రామంలో మద్యం వ్యసన విముక్తి (కేర్) అవగాహన కార్యక్రమం కర్నూలు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ హనుమంతరావుతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్, ఎన్‌జీఓ రాజేంద్రప్రసాద్ తదితరులు హాజరై మద్యం, సారా వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఎదురయ్యే ఆరోగ్య, ఆర్థికపరమైన సమస్యలను వివరించి ప్రజలకు అవగాహన కల్పించారు. సారా తయారీ మానుకున్న వారికి వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు నవీన్ బాబు, వెంకటరాజు, సిబ్బంది వెంకటేశ్వర్లు, నందీశ్వరరెడ్డి, రామలింగయ్య, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్